సాక్షి నల్లగొండ

సోమవారం ၊ 10 ၊ జూన్ ၊ 2024



జోరుగా ఇసుక దందా
మిర్యాలగూడ పరిధిలో ఆన్‌లైన్‌లో కంటే ఆఫ్‌లైన్‌లో ఇసుక రవాణా జోరుగా సాగుతోంది. - 2లో



యాదాద్రిలో భక్తుల రద్దీ
యాదాద్రికి ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. - 2లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం 32°/ 26°
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

14 మండలాల్లో కురిసిన వర్షం

నల్లగొండ అగ్రికల్చర్: నైరుతి రుతుపవనాల కారణంగా జిల్లాలోని 14 మండలాల్లో వర్షం కురిసింది. జిల్లాలో శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు సగటున 3.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా అడవిదేవులపల్లిలో 26.2 మిల్లీమీటర్లు, అత్యల్పంగా వేములపల్లిలో 0.3 మి.మీ. వర్షం కురిసింది. అలాగే దామరచర్లలో 24.9, పీఏపల్లిలో 19.6, గుర్రంపోడులో 17.1, త్రిపురారంలో 10.7, నిడమనూరులో 6.3, కనగల్‌లో 4.2, నల్లగొండలో 2.3, చందంపేటలో 1.6 , అనుముల హాలియాలో 1.2, మిర్యాలగూడలో 0.6, కట్టంగూర్, పెద్దవూర మండలంలో 0.5 మి.మీ. వర్షం కురిసింది.

పేలుళ్లతో ప్రజల్లో భయాందోళన

నాంపల్లి: మండలంలోని లక్ష్మణాపురం గ్రామంలో క్రిష్టరాయిన్‌పల్లి రిజర్వాయర్ పనుల్లో భాగంగా కొన్ని రోజులుగా ఎలాంటి అనుమతులు తీసుకోకుండా కొందరు సిబ్బంది స్థానిక గుట్టకు బరాలు పెట్టి పేలుస్తున్నారు. దీంతో పెద్దపెద్ద శబ్దాలు రావడంతోపాటు రాళ్లు వచ్చి ఇళ్ల మీద పడుతున్నాయని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. ఆదివారం బరాలు పెట్టడంతో పెద్ద శబ్దాలతో రాళ్లు వచ్చి ఇళ్ల మీద, వీధుల్లో పడ్డాయి. దీంతో గ్రామస్తులు భయాందోళనతో రిజర్వాయర్ క్యాంపు కార్యాలయం వద్దకు వెళ్లి రెండు గంటల పాటు ఆందోళన చేపట్టారు. పూర్తి స్థాయి పరిహారం అందించి, తమకు ఇబ్బందులు కలగకుండా ప్రాజెక్ట్ పనులు చేసుకోవాలని తేల్చి చెప్పారు. లేదంటే పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బర్ల శ్రీను, ఏడుదొడ్ల నారాయణరెడ్డి, నర్సిరెడ్డి, గడ్డి నరేష్, వట్టికోటి నరేష్, సామయ్య పాల్గొన్నారు.

మోడల్ టెస్టులతో మేలు



మోడల్ పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

రామగిరి(నల్లగొండ): వివిధ పోటీ పరీక్షలకు ప్రిపేరవుతున్న అభ్యర్థులకు మోడల్ టెస్టులు రావడం ఎంతో మేలు జరుగుతుందని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఐలు) జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతుల శంకరయ్య అన్నారు. జిల్లా కోర్టులోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఐలు నల్లగొండ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జూనియర్ సివిల్ జడ్జి మోడల్ పరీక్ష పేపర్లను విడుదల చేసి మాట్లాడారు. మోడల్ పరీక్ష రాయడం వల్ల జూనియర్ సివిల్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు టైం మేనేజ్మెంట్ సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఐలు జిల్లా నాయకులు పి.బ్రహ్మచారి, డి.నర్సాజీ, స్వామిదాస్, జనిగల లక్ష్మయ్య, వేములకొండ సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

మట్టపల్లిలో నారసింహుడి నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు ఆదివారం విశేషంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, ప్రాతఃకాలార్చన, నిత్య హోమం, మూలవిరాట్ స్వామికి పంచామృతాభిషేకం జరిపించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలంకరణతో అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. కల్యాణవేడుకలో భాగంగా విశ్వక్సేనారాధన, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ పూర్తిగావించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రవేశానంతరం నీరాజన మంత్ర పుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లి రావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్ అర్చకులు కృష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు పాల్గొన్నారు.

● దుకాణాల్లో సందడి

మరో రెండు రోజుల్లో పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు కావాల్సిన బ్యాగులు, పుస్తకాలు, యూనిఫామ్ కొనేందుకు తల్లిదండ్రులు దుకాణాలకు బారులుదీరుతున్నారు. ఆదివారమైనప్పటికీ నల్లగొండలోని రామగిరిలో ఓ దుకాణంలో విద్యార్థులతో కలిసి తల్లిదండ్రులు ఇలా బ్యాగులు కొంటూ కనిపించారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, నల్లగొండ



వ్యవసాయాధికారితో రేపు ఫోన్ ఇన్

వానాకాలం సీజన్ ఆరంభమైంది. ఒకవైపు ఎరువులు, విత్తనాల కొనుగోలు, మరోవైపు పొలం పనుల్లో రైతులు బిజీబిజీగా ఉంటున్నారు. ఈ సమయంలో విత్తనాల ఎంపిక, భూసార పరిరక్షణ, ఎరువుల వాడకం, సాగులో పాటించాల్సిన పద్ధతులు, ఏ సమయంలో ఏ పంటలు వేసుకోవాలి, అందుబాటులో ఉన్న ఎరువులు, విత్తనాల సమాచారం, నకిలీ విత్తనాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర విషయాలు తెలుసుకునేందుకు 'సాక్షి' 'వ్యవసాయాధికారితో ఫోన్ ఇన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. రైతులు నేరుగా జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్‌ను ఫోన్‌లో సంప్రదించి తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.



పాల్వాయి శ్రవణ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి

తేది. 11.06.2024 (మంగళవారం)
సమయం : ఉదయం 09 గంటల నుంచి 10 గంటల వరకు

దయల్ చేయాల్సిన ఫోన్ నంబర్ : 72888 94477

కలుషితానికి చెక్!

మున్సిపల్ చెరువుల్లోకి మురుగునీరు వెళ్లకుండా ప్రభుత్వం చర్యలు

- సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల ఏర్పాటుకు నిర్ణయం
- మున్సిపల్ శాఖకు డీపీఆర్ పంపిన జిల్లా యంత్రాంగం
- 17 ఎస్‌టీపీల నిర్మాణాలకు రూ.82.34 కోట్ల నిధులు మంజూరు
- పరిపాలన అనుమతుల కోసం ఎదురుచూపులు

నల్లగొండ టూటౌన్: జిల్లాలోని మున్సిపాలిటీల్లో చెరువులు, కుంటలు మురుగునీటితో కలుషితం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే చిట్యాల, నకిరేకల్, చండూరు, దేవరకొండ, నందికొండ, హాలియా మున్సిపాలిటీల్లో కలుషితమవుతున్న చెరువులు, కుంటలను గుర్తించింది. ఆయా చోట్ల స్వచ్ఛభారత్ మిషన్-2 కింద 17 మురుగునీటి శుద్ధి కేంద్రాల (ఎస్‌టీపీ-సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల) నిర్మాణానికి జిల్లా అధికారులు ప్రభుత్వానికి డీటేల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) కూడా పంపారు. దీంతో ప్రభుత్వం రూ.82.34 కోట్ల నిధులు కూడా మంజూరు చేసింది. ఇందుకు పరిపాలనపరమైన అనుమతులు రావాల్సి ఉంది.

చెరువు నీరు కలుషితం ఇలా..

జిల్లాలోని మున్సిపాలిటీల్లో మురుగునీటి శుద్ధి కేంద్రాలు లేకపోవడంతో ఆయాచోట్ల పలు చెరువులు, కుంటలు మురుగునీటితో కలుషితం అవుతున్నాయి. దీనివల్ల పర్యావరణం కూడా దెబ్బతింటుందని పర్యావరణ వేత్తలు చెబుతున్నారు. దీంతో మురుగు నీటి శుద్ధి కేంద్రాలను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలోని నల్లగొండ, మిర్యాలగూడ మున్సిపాలిటీల్లో మాత్రమే మురుగు నీటి శుద్ధి కేంద్రాలు ఉన్నాయి. ఈ పట్టణాల్లో గతంలోనే అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం సందర్భంలోనే నిర్మించారు. ఇక్కడ మురుగునీటి శుద్ధి కేంద్రాలు ఉన్నా.. పలు కాలనీల్లో డ్రెయినేజీ వ్యవస్థ పూర్తిస్థాయిలో లేకపోవడంతో చెరువుల్లోకి మురుగు వెళ్లి నీరు కలుషితమవుతోంది. అయితే ఆరేళ్ల క్రితం కొత్తగా ఏర్పడిన చిట్యాల, నకిరేకల్, చండూరు, దేవరకొండ, నందికొండ, హాలియా మున్సిపాలిటీల్లో ఇప్పటి వరకు మురుగునీటి శుద్ధి కేంద్రాలు లేవు. ఆయా మున్సిపాలిటీల్లోని గృహాల నుంచి వస్తున్న మురుగునీరు లోతట్టు ప్రాంతాల ద్వారా సమీపంలోని చెరువులు, కుంటల్లోకి చేరుతుంది. కొన్ని పట్టణాల్లో సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేక మురుగునీరు ఎక్కడికక్కడే నిలుస్తుండడంతో ప్రజలు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. ఏటా పట్టణీకరణ, జనాభా పెరుగుదలతో నీటి వినియోగం అధికమై మురుగునీరు కూడా అదేస్థాయిలో విడుదలవుతోంది. ఆ నీరంతా చెరువులు, కుంటల్లోకి వెళ్తుండడంతో కాలుష్యం పెరుగుతోందని అధికారులు గుర్తించారు.



నల్లగొండ పరిధిలోని చర్లపల్లి గ్రామ చెరువు

మున్సిపాలిటీ	శుద్ధికేంద్రాలు	మంజూరైన నిధులు (రూపాయలలో..)
చండూరు	4	12,52,51,000
చిట్యాల	4	13,85,01,000
దేవరకొండ	2	14,44,79,000
హాలియా	3	13,07,50,000
నకిరేకల్	3	19,07,70,000
నందికొండ	1	9,36,49,000

ప్రభుత్వానికి అందిన డీపీఆర్

జిల్లాలోని ఆరు మున్సిపాలిటీల్లో మురుగునీటి శుద్ధి కేంద్రాలను నిర్మించేందుకు ప్రజారోగ్య శాఖ అధికారులు డీపీఆర్ తయారు చేసి ప్రభుత్వానికి పంపించారు. ఆయా మున్సిపాలిటీల్లో మురుగు శుద్ధి కేంద్రాలు నిర్మించడానికి దాదాపు 2 ఎకరాల స్థలం అవసరం ఉంటుంది. ప్రభుత్వ స్థలాలు లేనిచోట ప్రైవేట్ వ్యక్తుల నుంచి కొనుగోలు చేయాల్సి ఉంటుంది. రాబోవు 30 సంవత్సరాల్లో పెరగనున్న జనాభాను దృష్టిలో పెట్టుకొని ఈ మురుగు నీటి శుద్ధి కేంద్రాలను నిర్మించనున్నారు.

వ్యర్థాలతోనూ ఇబ్బందులే..

మున్సిపాలిటీల్లో ముఖ్యంగా డ్రెయినేజీల్లో ప్లాస్టిక్ కవర్లు, ఇతర వ్యర్థాలు పడేయడంతో అవి మురుగునీటిలో కొట్టుకుపోయి చెరువులు, కుంటల్లో కలుస్తూ వాటిలోని నీరు కలుషితం అవుతోంది. దీంతో చెరువులు, కుంటల్లోని నీరు దుర్వాసన వస్తుండడంతో చివరికి మూగజీవులు కూడా తాగే పరిస్థితి లేకుండా పోతోందని ప్రజలు వాపోతున్నారు. ఎస్‌టీపీల నిర్మాణంలో జాప్యం చేయకుండా త్వరగా పూర్తిచేస్తే ప్రజలతోపాటు రైతాంగానికి మేలు జరగనుంది.

ప్రభుత్వానికి డీపీఆర్ పంపించాం



చెరువులు, కుంటల్లో నీరు కలుషితం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. జిల్లాలోని ఆరు మున్సిపాలిటీల్లో మురుగునీటి శుద్ధి కేంద్రాలు నిర్మించడానికి ప్రభుత్వానికి డీపీఆర్ పంపించాం. ప్రభుత్వం నిధులు కూడా మంజూరు చేసింది. అడ్మిస్ట్రేషన్ అనుమతులు రాగానే టెండర్లు పిలుస్తాం.

– కందుకూరి వెంకటేశ్వర్లు, ప్రజారోగ్య శాఖ ఎస్‌ఈ, నల్లగొండ

గ్రూప్-1 ప్రిలిమ్స్‌కు 13,616 మంది హాజరు



ఎన్జీ కాలేజీ సెంటర్‌లో అభ్యర్థులను తనిఖీలు చేస్తున్న పోలీసులు

- గైర్హాజరైన అభ్యర్థులు 3,283 మంది
- కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్, ఎస్పీ, అదనపు కలెక్టర్

నల్లగొండ: జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 47 పరీక్ష కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షకు 16,899 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 13,616 మంది హాజరయ్యారు. 3,283 మంది గైర్హాజరయ్యారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన పరీక్ష మధ్యాహ్నం ఒంటి గంటకు ముగిసింది. పలు సెంటర్లలో అభ్యర్థులు ఆలస్యంగా రావడంతో లోనికి అనుమతించలేదు. దీంతో అభ్యర్థులు నిరాశతో వెనుదిరిగారు.

కలెక్టర్, ఎస్పీ తనిఖీలు

నల్లగొండలోని ఉమెన్స్ డిగ్రీ కళాశాల, ఎంజీయూలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను కలెక్టర్ హరిచందన తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల్లో కల్పించిన సౌకర్యాలు, హాజరైన, గైర్హాజరైన అభ్యర్థుల వివరాలను పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లను అడిగి తెలుసుకున్నారు. ఎంజీ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్‌తో పాటు ఎస్పీ చందనా దీప్తి కూడా తనిఖీ చేశారు. పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసిన, ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించిన అధికారులు, సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. అలాగే దేవరకొండ రోడ్డులోని సందీప్, సెయింట్ ఆల్ఫోన్సెస్ పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట నల్లగొండ ఆర్డీఓ రవి, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.





ట్రైసైకిల్‌పై పరీక్షకు వస్తున్న దివ్యాంగురాలు



పరీక్ష సెంటర్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ హరిచందన, అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర

రైతు భరోసా నిధులు విడుదల చేయాలి

నల్లగొండ టౌన్: అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా పథకానికి నిధులు విడుదల చేసి వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నల్లగొండలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో జరిగిన ఆ పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 15లోగా రూ.2 లక్షల వరకు ఏకకాలంలో రైతు మాఫీ చేయాలని, వ్యవసాయ సీజన్ ఆరంభమైనందున కొత్త రుణాలు ఇచ్చేవిధంగా బ్యాంకర్లను ఆదేశించాలన్నారు. రైతు బీమా, పంటల బీమా కూడా అమలు చేయాలన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వర్షాల వల్ల గుంతలు పడిన రోడ్లకు మరమ్మతులు చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు తుమ్మల వీరారెడ్డి, డి.మల్లేశం, నారి ఐలయ్య, బండ శ్రీశైలం, కందాల ప్రమీల, పాలడుగు నాగార్జున, ప్రభావతి, సయ్యద్ హాశం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

నేడు సర్టిఫికెట్ల పరిశీలన

నల్లగొండ: బదిలీ, ప్రమోషన్ కోసం దరఖాస్తు చేసుకున్న లాంగ్వేజీ పండిట్‌లు, పీఈటీల ఒరిజినల్ సర్టిఫికెట్లు, సర్వీస్ పుస్తకాలను సోమవారం పరిశీలిస్తామని డీఈఓ భిక్షపతి పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందని, ఉపాధ్యాయులంతా సకాలంలో హాజరై సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలని కోరారు.

ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

నల్లగొండ టౌన్: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం పోరాడిన ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు 250 గజాల ఇంటి స్థలం, గుర్తింపు కార్డులు ఇవ్వాలని తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొల్లూరి కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం నల్లగొండలోని పీఆర్‌టీయూ భవన్‌లో జరిగిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరవీరుల కుటుంబాలకు ప్రతినెలా రూ.25 వేల గౌరవ వేతనంతోపాటు ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. అంతకుముందు సంఘం రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా కిరణ్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎండీ.కాశీం, ప్రధాన కార్యదర్శిగా అల్లె పరమేష్, సహాయ కార్యదర్శిగా పర్వతం వేణు, కట్ట శ్రీను, కోశాధికారిగా కట్ట రమేష్‌తో పాటు 15 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కిరణ్‌కుమార్ మాట్లాడారు.



సమావేశంలో మాట్లాడుతున్న కిరణ్‌కుమార్

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం చేయొద్దు

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్: అభివృద్ధి పనుల్లో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆదివారం హుజూర్‌నగర్‌లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే పద్మావతితో కలిసి ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అధికారులు శక్తివంచన లేకుండా పని చేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులకు, ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్నారు. రెండు నియోజకవర్గాల్లో పంచాయతీరాజ్ శాఖ ద్వారా 85 పనులకు, రెన్యూవల్ పనులకు రూ 124.65 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు. అదేవిధంగా ఆర్అండ్‌బీ ద్వారా హుజూర్‌నగర్ నియోజకవర్గంలో 35 రహదారుల నిర్మాణానికి రూ.267 కోట్లు, కోదాడ నియోజకవర్గంలో 7 పనులకుగాను రూ.156 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఎస్‌ఈ రాజేశ్వర రెడ్డి, ఈఈ భాస్కర్ రావు, డీఈ రమేష్, విద్యుత్ శాఖ ఎస్‌ఈ పాల్‌రాజ్, డీఈ వెంకట కృష్ణయ్య, పీఆర్ ఎస్‌ఈ రామకృష్ణ, ఈఈ వెంకటయ్య, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి

'సీజనల్' ముప్పును ఎదుర్కొనేలా..

- వర్షాల నేపథ్యంలో అప్రమత్తమైన వైద్య ఆరోగ్య శాఖ
- దోమల నివారణపై అవగాహన కార్యక్రమాలు
- మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు
- శుక్ర, మంగళవారాల్లో డ్రై డేగా పాటించాలని సూచన

నల్లగొండ టౌన్: జిల్లాలో సీజనల్ వ్యాధులు ముప్పును ఎదుర్కొనేలా వైద్య ఆరోగ్య శాఖ ముందస్తు చర్యలు చేపట్టింది. దీంట్లో భాగంగా దోమల నివారణ, ప్రతి శుక్ర, మంగళవారాల్లో డ్రై డే పాటించాలని ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. జిల్లాలో పది రోజులుగా కురుస్తున్న వర్షాలతో పట్టణాలు, పల్లెల్లో ఎక్కడికక్కడ మురుగునీటి గుంతలు, డ్రెయినేజీల్లో నీరు నిలిచిపోయింది. దీంతో దోమలు, ఈగలు వ్యాప్తి చెందుతున్నాయి. వీటి కారణంగా ఇప్పటికే ప్రజలు సీజనల్ జ్వరాలబారిన పడి ఆస్పత్రుల్లో చేరుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో వైద్య ఆరోగ్య శాఖ యంత్రాంగా ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తోంది.

ఆరోగ్య సిబ్బందిని అప్రమత్తం చేస్తూ..

ప్రస్తుత వర్షాకాల పరిస్థితుల నేపథ్యంలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్, పైలేరియా, ఇతర విష జ్వరాలు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది. అలాగే ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 34 డెంగీ పాజిటివ్ కేసులు నమోదైనట్లు అధికార గణాంకాలు చెబుతున్నాయి. దీంతో పాటుగా పైలేరియా కేసులు 25 నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో వైద్య ఆరోగ్య శాఖ.. జిల్లా మలేరియా నియంత్రణ విభాగం సిబ్బంది సమన్వయంతో సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు చర్యలు చేపట్టింది. మున్సిపల్ పట్టణ, అర్బన్ ఏరియాల్లో అధికారులు, సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ డ్రెయినేజీల్లో దోమల నివారణ మందును పిచికారీ చేయిస్తోంది.

వార్డుల్లో పర్యటిస్తూ ప్రజలకు అవగాహన

జిల్లాలో సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బందితో కలిసి ప్రతి వార్డుల్లో పర్యటించి సమావేశాలు నిర్వహించి దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి శుక్ర, మంగళవారాల్లో కాలనీల్లో ప్రజలను డ్రైడేగా పాటించాలని, వివిధ చోట్లలో నిల్వ ఉన్న నీటిని తొలగించుకోవాలని సూచిస్తున్నారు. ఇప్పటికే డెంగీ నివారణ దినోత్సవాన్ని నిర్వహించి ప్రతి వార్డులో అవగాహన కల్పించారు. ప్రస్తుతం మలేరియా వారోత్సవాల సందర్భంగా కరపత్రాల ద్వారా దోమలు పుట్టకుండా, కుట్టకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలను చైతన్యం చేస్తున్నారు. పీహెచ్‌సీల్లో మందులను అందుబాటులో ఉంచి ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.



డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న నల్లగొండ అర్బన్ హెల్త్ సెంటర్ సిబ్బంది (ఫైల్)



టైర్‌లో నిల్వ ఉన్న నీటిని తొలగిస్తున్న ఆరోగ్య సిబ్బంది

అప్రమత్తంగా ఉన్నాం..



వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల వ్యాప్తిచెందకుండా అప్రమత్తంగా ఉన్నాం. దోమలు, ఈగలు వ్యాప్తిని అరికట్టేందుకు అన్నిచర్యలు తీసుకున్నాం. ప్రతి వార్డులో మురుగునీరు నిల్వ లేకుండా దోమలు పుట్టకుండా, కుట్టకుండా ముందస్తు చర్యలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలు బుధ, శుక్రవారాల్లో డ్రై డేగా పాటించి నీటి నిల్వలను తొలగించుకోవాలి.

– రుద్రాక్షి దుర్గయ్య, జిల్లా మలేరియా అధికారి, నల్లగొండ

కాలనీలో ఫాగింగ్ చేపట్టాలి



మా కాలనీలో చాలాచోట్ల గుంతల్లో మురుగునీరు నిల్వ ఉంటుంది. దీని ద్వారా దోమలు విపరీతంగా వ్యాప్తి చెంది కాలనీ వాసులు జ్వరాల బారిన పడుతున్నారు. నీటి నిల్వలు లేకుండా సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకుని కాలనీ ప్రజల ఇబ్బందులను తొలగించాలి. కాలనీలో దోమల నివారణకు ఫాగింగ్‌ను చేయాలి.

– బొడ్డుపల్లి యాదయ్య, హౌజింగ్ బోర్డు కాలనీ, నల్లగొండ

క్లుప్తంగా

సూర్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయాసమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపించారు. ఆ తర్వాత యజ్ఞశాలలో మహాసౌరహోమాన్ని నిర్వహించారు. క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్, శ్రీరామ కోటి స్థూపాలను భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద సత్రంలో ఆదిత్య సేవా కేంద్రం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కాగా వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకుడు, సౌర ఆరాధకులు జనార్దన్‌స్వామి, గణపురం నరేష్, బీరవోలు ఇంద్రారెడ్డి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి దుర్మరణం

నార్కట్‌పల్లి: రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన శనివారం రాత్రి నార్కట్‌పల్లి మండల కేంద్రం పరిధిలోని పంజాబీ దాబా వద్ద విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై జరిగింది. వివరాలు.. నార్కట్‌పల్లి మండల కేంద్రం పరిధిలోని పంజాబీ దాబా వద్ద శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి, మరో ట్రాన్స్‌జెండర్ రోడ్డు దాటుతుండగా అదే సమయంలో విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం వారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సదరు వ్యక్తికి తీవ్రగాయలై అక్కడికక్కడే మృతిచెందాడు. ట్రాన్స్‌జెండర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సమచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని, క్షతగాత్రురాలిని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

తిరుమలగిరి: తిరుమలగిరి మండలం రాజానాయక్ తండాలో రైతు చందులాల్‌కు చెందిన ఎద్దు ఆదివారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. వ్యవసాయ పనులు చేస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ పక్కన విద్యుత్ తీగలు తగిలి ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ రూ.1 లక్ష వరకు ఉంటుందని రైతు వాపోయారు.

ఆవుదూడలను తరలిస్తున్న డీసీఎం పట్టివేత

నూతనకల్: ఆవుదూడలను తరలిస్తున్న డీసీఎంను పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ జూకూరి సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. నూతనకల్ మండలం బిక్కుమళ్ల గ్రామ శివారులో 365వ నంబర్ జాతీయ రహదారిపై చెక్‌పోస్టు వద్ద పోలీసులు శనివారం రాత్రి వాహనాల తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి నుంచి కొబ్బరి చిప్పల లోడ్‌తో హైదరాబాద్‌కు వెళ్తున్న డీసీఎంను ఆపి తనిఖీ చేయగా కొబ్బరి చిప్పల అడుగు భాగంలో 24 ఆవుదూడలను పోలీసులు గుర్తించారు. ఆవుదూడలను హైదరాబాద్‌లోని గోశాలకు తరలించారు. రమావత్ శరత్‌కుమార్, కోమలి శ్రీను, వీరబాబు, బతావత్ రాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

జోరుగా ఇసుక దందా


పాలేరువాగు నుంచి ట్రాక్టర్లలో తరలిస్తున్న ఇసుక


సల్కునూరు వద్ద ఇసుక డంప్

- ప్రభుత్వ పనుల పేరిట అక్రమ రవాణా
- అక్రమార్కులకు కాసులు కురిపిస్తున్న ఇసుక
- ప్రభుత్వ ఆదాయానికి పెద్దఎత్తున గండి

మిర్యాలగూడ: సామాన్యులకు ఇసుక అందుబాటులో ఉండాలని ప్రభుత్వం ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా ఇసుక సరఫరా విధానాన్ని ప్రవేశపెట్టింది. కానీ నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ఆన్‌లైన్ కంటే ఆఫ్‌లైన్‌లో ఇసుక రవాణా జోరుగా సాగుతోంది. మిర్యాలగూడ మండలంలోని కాల్వపల్లి, తక్కెళ్లపల్లిలో, వేములపల్లి మండలంలోని రావులపెంట, కామేపల్లిలో ఇసుక రీచ్‌లు ఉన్నాయి. ఈ రీచ్‌ల ద్వారా కేవలం ఆన్‌లైన్ బుక్ చేసుకున్న వారికి మాత్రమే ఇసుక సరఫరా చేయాలి. కానీ ఆఫ్‌లైన్‌లో ఇసుక దందా జోరుగా నడుస్తోంది. నిత్యం వందలాది ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణా అవుతోంది. దినదినాభివృద్ధి చెందుతున్న మిర్యాలగూడ పట్టణంలో భవన నిర్మాణాలు కూడా పెద్దఎత్తున జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఇసుక అవసరం కూడా పెద్ద ఎత్తున ఉంది. దీన్ని ఆసరా చేసుకున్న అక్రమార్కులు ఆన్‌లైన్‌లో కాకుండా నేరుగా ఇసుక రీచ్‌ల నుంచి రాత్రి, పగలు అనే తేడా లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తూ లక్షల రూపాయలు ఆర్జిస్తున్నారు.

ప్రభుత్వ పనుల పేరుతో..

మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలల మరమ్మతులకు ఇసుక అవసరం ఉండగా దాని పేరిట పెద్దఎత్తున ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వానికి సంబంధించిన పనుల పేరుతో అక్రమార్కులు ఉదయం నుంచి సాయంత్రం వరకు అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. ఇసుక రవాణాలో అధికార పార్టీ, ప్రజాప్రతినిధుల పాత్ర కీలకంగా ఉన్నట్లు విశ్వసనీయం సమాచారం. వారి ఒత్తిడి మేరకు పోలీసులు సైతం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆన్‌లైన్‌లో బుక్ చేస్తే రాదు..

ఇసుక కావాల్సిన వారు ముందుగానే ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకోవాలి. సీరియల్ ప్రకారం బుకింగ్ చేసుకున్న 3, 4 రోజుల్లోపే ఇసుక వినియోగదారునికి సరఫరా కావాలి. మిర్యాలగూడ పట్టణ పరిసర ప్రాంతాల్లో వందలాది మంది ఇసుక కోసం నెల రోజుల క్రితమే బుకింగ్ చేసుకున్నప్పటికీ సరఫరా కావడంలేదు. దీంతో నిర్మాణాలు ఆగిపోయి వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో వినియోగదారులు రెట్టింపు ధరలు చెల్లించి ఇసుక కొనుగోలు చేస్తున్నారు. కొందరు ఇసుకను శివారు ప్రాంతాల్లో డంపింగ్ చేసి అధిక ధరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి

ఆన్‌లైన్ బుకింగ్ కంటే ఎక్కువగా నేరుగా ఇసుక తరలిస్తుండడంతో ప్రభుత్వ ఆదాయానికి పెద్ద ఎత్తున గండి పడుతోంది. వేములపల్లి మండలంలోని మూసీ, పాలేరు వాగులతో పాటు మాడుగులపల్లి మండలం బొమ్మకల్ గ్రామం నుంచి కూడా భారీ ఎత్తున ఇసుకను తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.12వేల చొప్పున పోలీసులకు ముట్టజెప్పి ఇసుక దందాను కొనసాగిస్తున్నట్లు సమాచారం. అదేవిధంగా దామరచర్ల మండలంలో సైతం ఇదే దందా కొనసాగుతున్నా.. అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో పోలీసులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుని రోజుల తరబడి వేచి చూసినా ఇసుక సరఫరా రాకపోవడంతో బుకింగ్ చేసేందుకు కూడా వినియోగదారులు ముందుకు రావడం లేదు.

> **ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకుంటేనే సరఫరా**
>
> ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకున్న వారికి మాత్రమే ఇసుక సరఫరా చేసేందుకు అనుమతి ఉంది. అక్రమంగా ఇసుక తరలిస్తే ఒక్కో ట్రాక్టర్‌కు రూ.5వేల జరిమానాతో పాటు రూ.25వేలు డిపాజిట్‌గా వసూలు చేస్తాం. సాయంత్రం 6 తర్వాత ఇసుక రవాణాకు అనుమతి లేదు.
>
> – జాకబ్, మైనింగ్ ఏడీ

యాదాద్రిలో భక్తుల రద్దీ


తూర్పు మాడ వీధిలోని క్యూలైన్‌లో భక్తులు


క్యూకాంప్లెక్స్‌లో నిండిపోయిన భక్తులు


ర్యాంప్ పైనుంచి దర్శనానికి వెళ్తున్న భక్తులు

- 50వేల మందికి పైగా భక్తుల రాక
- స్వామివారి దర్శనానికి 4గంటల సమయం

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. వేసవి సెలవులు ముగుస్తుండడంతో హైదరాబాద్– సికింద్రాబాద్ జంట నగరాలతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులు అధికంగా స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చారు. దీంతో స్వామివారి ధర్మదర్శనానికి 4గంటలకు పైగా, వీఐపీ దర్శనానికి గంటన్నరకు పైగా సమయం పట్టింది. భక్తులు అధికంగా రావడంతో ఆలయ క్యూకాంప్లెక్స్, ప్రసాద విక్రయశాల, ముఖ మండపం, ఆలయ పరిసరాలు, లక్ష్మీ పుష్కరిణి, కల్యాణ కట్ట, శివాలయం వంటి ప్రాంతాలు కిటకిటలాడాయి. శ్రీస్వామి వారిని 50వేల మందికి పైగా భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ పూజలతో నిత్యాదాయం రూ.83,19,056 వచ్చినట్లు ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అత్యుత్తమ ర్యాంకులు


కె. వెంకటేష్ బి. హర్షిత జి. గోపి జి. చందన

సూర్యాపేట: జేఈఈ అడ్వాన్స్‌డ్–2024 ఫలితాల్లో సూర్యాపేట పట్టణంలోని జయ జూనియర్ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ ఆదివారం తెలిపారు. తమ కళాశాలకు చెందిన కె. వెంకటేష్ ఆలిండియా స్థాయిలో 293వ ర్యాంక్, బి. హర్షిత 1070వ ర్యాంక్, జి.గోపి 1143వ ర్యాంక్, జి.చందన 1864వ ర్యాంక్, జి.సింధు 2717వ ర్యాంక్, ఎం.అక్షయ 2840వ ర్యాంక్, కె.సిద్ధార్థన్ 3067వ ర్యాంక్, పి.గౌతమ్ 3271వ ర్యాంక్, ఎం.హర్షిని 4047వ ర్యాంక్, వి.మహేష్ 5153వ ర్యాంక్, జి.అక్షయ 5421వ ర్యాంక్, జి.శశికుమార్ 5648వ ర్యాంక్, పి.కౌశిక్ 7092వ ర్యాంక్‌లు సాధించినట్లు పేర్కొన్నారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను, వారికి సహకరించిన అధ్యాపక బృందాన్ని కరస్పాండెంట్ జయ వేణుగోపాల్, డైరెక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మ అభినందించారు.

నేడు ఆలయ భూముల కౌలు వేలం

మఠంపల్లి: మండల పరిధిలోని చౌటపల్లిలో గల రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి దేవాలయ భూములకు సంబంధించిన కౌలు వేలం సోమవారం ఉదయం 10.30 గంటలకు దేవాలయ ఆవరణలో నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ టి. వెంకటాచలపతి తెలిపారు. ఆదివారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. చౌటపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 593, 594, 726లో గల 15ఎకరాల 30గుంటల దేవాలయ భూములకు 2024–25 సంవత్సరానికి గాను దేవాదాయధర్మాదాయ చట్టం ప్రకారం కౌలు చేసుకునేందుకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనే రైతులు రూ.10వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. అదే విధంగా వేలం దక్కించుకున్న కౌలు రైతులు కౌలు పైకం మొత్తాన్ని ఏడు రోజుల్లో చెల్లించి రశీదు పొందాలన్నారు.

మట్టపల్లిలో సూర్యాపేట జిల్లా జడ్జి పూజలు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలోని స్వయంభూ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఆదివారం సూర్యాపేట జిల్లా జడ్జి ఎస్. గోవర్ధన్‌రెడ్డి కుటుంబ సమేతంగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు జడ్జి దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం జడ్జి దంపతులను స్వామివారి చిత్రపటంతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హుజూర్‌నగర్ సబ్‌జడ్జి శ్యాంకుమార్, ఎస్‌ఐ రామాంజనేయులు, అర్చకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.


సూర్యాపేట జిల్లా జడ్జి గోవర్ధన్‌రెడ్డి దంపతులను సత్కరిస్తున్న ఆలయ ధర్మకర్తలు, అర్చకులు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలి



మాట్లాడుతున్న టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాములు

సూర్యాపేట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేలా చర్యలు తీసుకోవాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్. రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సూర్యాపేట పట్టణంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమవేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన ప్రభుత్వ టీచర్ల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను ఎలాంటి అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా చేపట్టాలన్నారు. ఉపాధ్యాయుల నియమాకం జరిగేంత వరకు విద్యావలంటీర్లను నియమించాలని, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సోమయ్య, అనిల్‌కుమార్, యాకయ్య, శ్రీనివాస్‌రెడ్డి, అరుణభారతి, వెంకటయ్య, వీరారెడ్డి, పాపిరెడ్డి, నాగేశ్వర్‌రావు, రమేష్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులపై పోలీసుల దాడులు

భువనగిరి క్రైం: భువనగిరి పట్టణంలోని పోచమ్మవాడ, ఖాజీ మహల్లా తదితర బస్తీల్లోని బెల్ట్ షాపులపై ఆదివారం రాత్రి పట్టణ పోలీసులు ఆకస్మికంగా దాడులు చేశారు. పట్టణ ఇన్‌స్పెక్టర్ కే. సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో దాడి చేసి రెండు బెల్ట్ షాపులలో విక్రయిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు బెల్ట్ షాపుల నిర్వాహకులను అరెస్ట్ చేశారు.

కారులో నిద్రిస్తున్న వారిపై దుండగుల దాడి

- ఐదు తులాల బంగారు ఆభరణాలు అపహరణ
- చిట్యాల మండలం పెద్దకాపర్తి శివారులో ఘటన


చోరీ జరిగిన స్థలాన్ని పరిశీలిస్తున్న నల్లగొండ ఎస్పీ చందనాదీప్తి

చిట్యాల: దూర ప్రయాణం చేస్తూ విశ్రాంతి కోసం జాతీయ రహదారి పక్కన కారు పార్కింగ్ చేసి నిద్రిస్తున్న వారిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ శివారులో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి జరిగింది. ఎస్‌ఐ డి. సైదాబాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పుగోదావరి జిల్లా అమలాపురం మండలం తోట్లపాలెం గ్రామానికి చెందిన పల్లెపు శృతి, ఆమె అన్న పంచాక్షరి, వదిన అఖిల, వారి కుమారుడు దేవాన్ష్ కలిసి బొలేరో కారులో శనివారం సాయంత్రం హైదరాబాద్‌కు బయల్దేరారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ శివారులోకి రాగానే అర్ధరాత్రి రెండున్నర కావడంతో విశ్రాంతి కోసం జాతీయ రహదారి పక్కన గల సర్వీస్ రోడ్డులో కారును నిలిపి వాహనంలోనే వారు నిద్రించారు. కొద్దిసేపటి తర్వాత ఇద్దరు యువకులు టీషర్టులు ధరించి, ముఖాలు కన్పించకుండా గుడ్డలు కట్టుకుని వచ్చి కారు అద్దాలను రాళ్లతో పగులగొట్టారు. ఆ శబ్దానికి మేల్కొన్న పంచాక్షరి, అఖిలపై రాళ్లతో దాడి చేశారు. అఖిల ఒంటిపై ఉన్న మూడు తులాల బంగారు పుస్తెలతాడు, పంచాక్షరి చేతి వేలికి ఉన్న తులం బంగారు ఉంగరం, పల్లెపు శృతి మెడలో ఉన్న తులం బంగారు గొలుసును ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై శృతి ఆదివారం చిట్యాల పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించిన ఎస్పీ..

చోరీ జరిగిన ప్రాంతాన్ని ఆదివారం నల్లగొండ జిల్లా ఎస్పీ చందనాదీప్తి పరిశీలించారు. చిట్యాల ఎస్‌ఐ డి. సైదాబాబును అడిగి వివరాలను తెలుసుకున్నారు. వేగంగా దర్యాప్తు చేసి దుండగులను గుర్తించాలని పోలీసులను ఆమె ఆదేశించారు. ఆమె వెంట నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి తదితరులున్నారు.


ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

చౌటుప్పల్: ఆస్తి పంపకాల విషయంలో తగాదాలతో మనస్తాపం చెందిన వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన చౌటుప్పల్ మండలంలోని పంతంగి గ్రామంలో ఆదివారం జరిగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పంతంగి గ్రామానికి చెందిన చీరిక హన్మంతరెడ్డి (48)కి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరంతా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. హన్మంతరెడ్డి తమ్ముడు, ఇద్దరు చెల్లెళ్లు ఉన్నారు. వారసత్వంగా వచ్చిన భూమి విషయంలో వారి మధ్య తగాదాలు జరుగుతున్నాయి. పెద్ద మనుషుల సమక్షంలో వివాదం పరిష్కారం చేసుకునేందుకుగాను హన్మంతరెడ్డి శనివారం హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వచ్చాడు. రాత్రి ఇంట్లో ఒక్కడే నిద్రించాడు. ఎప్పుడూ తెల్లవారుజామునే నిద్రలేచే హన్మంతరెడ్డి ఆదివారం ఉదయం పొద్దుపోయే వరకు కూడా తలుపు తీయకపోవడంతో పక్కింటి వ్యక్తులు వచ్చి చూడగా.. ఇంట్లో ఉరేసుకుని కన్పించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని చౌటుప్పల్‌లోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్తి తగాదాలు తేలే వరకు అంత్యక్రియలు నిర్వహించేదిలేదని మృతుడి అత్తగారి తరపు బంధువులు భీష్మించుకు కూర్చున్నారు. దీంతో మృతదేహాన్ని ఆస్పత్రిలోనే ఉంచారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

నార్కట్‌పల్లి: ట్రాన్స్‌ఫార్మర్ బంద్ చేస్తుండగా విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం నార్కట్‌పల్లి మండలం బెండల్‌పహాడ్ గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బెండల్‌పహాడ్ గ్రామానికి చెందిన యానాల కృష్ణారెడ్డి(58) భూమి కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. ఆదివారం వ్యవసాయ బావి మోటారుకు రిపేర్ చేసి దానిని ఆన్ చేసేందుకు గాను అక్కడే ఉన్న ట్రాన్స్‌ఫార్మన్ బంద్ చేస్తుండగా.. విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమారుడు యానాల జాన్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపారు.

మిరప సాగులో మెళకువలు



పెద్దవూర: గత రెండేళ్లుగా వానాకాలం సీజన్‌లో పత్తి పంటలో ఆశించిన దిగుబడులు రాకపోవడంతో పాటు మిరపకు మార్కెట్‌లో అధిక ధర లభిస్తుండడంతో ఈ వానాకాలం సీజన్‌లో రైతులు మిరప పంటను అధిక విస్తీర్ణంలో సాగుచేయడానికి సిద్ధమవుతున్నారు. పంట మార్పిడి విధానాన్ని అవలంబిస్తూ, మిరప చేను చుట్టూ రక్షణ పంటలుగా హైబ్రిడ్ జొన్న లేదా మొక్కజొన్నను రెండు లేదా మూడు సాళ్లలో వేయాలని, కీటక ఆకర్షణ(ఎర) పంటలుగా బంతి, ఆముదాన్ని పొలంలో అక్కడక్కడా వేయాలని పెద్దవూర మండలం ఉద్యానవన శాఖ అధికారి బి. రవినాయక్ సూచిస్తున్నారు. మిరప సాగు విధానం, యాజమాన్య పద్ధతులు ఆయన మాటల్లోనే..

అనువైన నేలలు

మిరప సాగుకు ఉదజని సూచిక(పీహెచ్) 6 నుంచి 6.5 ఉన్న నేలలు అత్యంత అనుకూలం. వర్షాధారపు పంటకు నల్ల రేగడి నేలలు అనుకూలం. నీటి ఆధారపు పంటకు నల్ల నేలలు, చెల్క నేలలు, ఇసుకతో కూడిన ఒండ్రు నేలలు, ఎర్రనేలలు అనుకూలం.


ప్రోట్రేలలో పెరుగుతున్న మిరప నారు

వాతావరణం, విత్తే సమయం

మిరప పంట అన్ని రకాల వాతావరణ పరిస్థితులను తట్టుకోగలదు. అయితే మిరపకు 10 నుంచి 35 డిగ్రీల ఉష్ణోగ్రత అనుకూలం. ఎండు మిరప పంటను వానాకాలం సీజన్‌లో వేసుకోవడం మంచిది. పచ్చి మిరప సంవత్సరం పొడవునా సాగు చేసుకోవచ్చు. సాధారణంగా మిరప పంటను ఖరీఫ్ సీజన్‌లో జూలై, ఆగస్టులో, యాసంగి సీజన్‌లో అయితే అక్టోబర్, నవంబర్ నెలలో సాగు చేసుకోవచ్చు.

నేల తయారీ

పొలాన్ని వేసవిలో లోతుగా దున్ని, ఆఖరి దుక్కిలో ఎకరానికి 10 టన్నుల పశువుల ఎరువు, 20 కిలోల వేప పిండి, 150 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్‌ను వేయాలి. అలాగే 90 కిలోల పశువుల ఎరువు, 10 కిలోల వేపపిండి, 2కిలోల ట్రై కోడెర్మావిరిడి శిలీంధ్రపు పొడిని కలిపి 10–15 రోజులు నీడలో ఉంచి శిలీంధ్రం వృద్ధి చెందిన తర్వాత ఆఖరి దుక్కిలో వేసినట్లైతే తొలి దశలో మొక్కలను ఆశించే తెగుళ్ల నుంచి కాపాడవచ్చు. పంట సాగు భూమిలో పోషకాల శాతాన్ని పెంచుకోవడానికి ముందుగా పచ్చిరొట్ట లేదా మినుము పంటను వేసుకుని భూమిలో కలియ దున్నాలి. దీనివలన భూమికి సహజ పోషకాలు లభిస్తాయి. 10–15 రోజుల తర్వాత ట్రాక్టర్ కల్టివేటర్‌తో నేల మెత్తగా దుక్కి అయ్యే వరకు 1–3 సార్లు దున్నుకోవాలి.

విత్తన మోతాదు

మిరపను రెండు రకాల పద్ధతుల ద్వారా సాగు చేయవచ్చు. మిరప విత్తనాలను నేరుగా ప్రధాన పొలంలో విత్తడానికి అయితే ఎకరాకు 2.5 కిలోల విత్తనం సరిపోతుంది. అలా కాకుండా నారు పెంచుటకు విత్తన మోతాదు సూటి రకాలకు 650 గ్రాములు, హైబ్రిడ్ రకాలైతే 75 నుంచి 100 గ్రాముల విత్తనం సరిపోతుంది.

రెండు పద్ధతుల్లో నారు తయారీ

1. ఎత్తైన నారుమడి తయారీ: మిరప నారుమడికి సారవంతమైన ఒండ్రునేలలు, నీటి వసతి, ఒక మోస్తారు నీడ కలిగిన ప్రదేశాలు చాలా అనుకూలం. ఒక మీటరు వెడల్పు, 40 మీటర్ల పొడవు, 15 సెం.మీ. ఎత్తుగల మడిలో ఒక ఎకరంలో నాటడానికి అవసరమైన నారు పెంచుకోవచ్చు. నారు పెంచటానికి నేలకు కొంచెం ఎత్తులో మట్టిని బెడ్డుగా చేసుకోవాలి. నాలుగు మూలలు సమాన ఎత్తులో ఉండేలా చూసుకోవాలి. నారుమళ్లలో విత్తనాలను 5 నుంచి 8 సెం.మీ. మధ్యదూరం, 1.5 సెం.మీ. లోతులో వరుసల్లో విత్తనాలను పలుచగా విత్తుకోవాలి. విత్తిన 9వ రోజు, 13వ రోజున లీటర్ నీటిలో 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను కలిపిన ద్రావణంలో నారుమళ్లను తడపాలి.

2. ప్రోట్రేలలో నారును పెంచే విధానం: ఈ పద్ధతిలో ప్రతి విత్తనం సమానంగా, ఆరోగ్యంగా పెరిగి మొక్కలు సమానంగా ఉండి పంట ఒకేసారి కాపునకు వస్తుంది. దీంతో పాటు నారు ధృడంగా పెరగడంతో పాటు నారుకుళ్లు, వైరస్ తెగుళ్లు ఆశించే అవకాశం తక్కువగా ఉంటుంది. ఒక ఎకరా ప్రధాన పొలంలో నాటుకు కావాల్సి న వారు 98 సెల్స్ కలిగిన 120 ట్రేలు సరిపోతాయి. ఒక్కో ప్రోట్రేను నింపుటకు సుమారు 1.2 కిలోల కోకోపిట్(కొబ్బరి పెంట) మిశ్రమం అవసరం. ఒక్కొక్క సెల్‌లో ఒక్క విత్తనం నాటుకుని తిరిగి కోకోపిట్‌తో కప్పుకోవాలి. 6రోజుల తర్వాత మొక్క మొలకెత్తడం ప్రారంభమయ్యాక వీటిని ఎత్తైన్న న బెడ్ల లోకి మార్చుకోవాలి.

మొక్కలను నాటుకునే విధానం

మొక్కలను నీటి వసతి నేలల్లో నాటుకునేప్పుడు 24×24 అంగుళాలు(ఇంచులు) లేదా 26×26 లేదా 28×28 అంగుళాల దూరంలో నేల స్వభావాన్ని బట్టి నాటుకోవాలి. మొక్కలు పెట్టడానికి తీసిన రంధ్రాలలో కొద్దిగా నీరు పోసి వేర్లు మడత పడకుండా జాగ్రత్తగా నాటుకోవాలి. డ్రిప్ పద్ధతిలో నాటుకునేటప్పుడు మొక్కల మధ్య దూరం 30–45 అంగుళాలు అనువైనది.

> **విత్తనశుద్ధి**
>
> విత్తనశుద్ధి చేసుకోవడం ద్వారా విత్తనం నుంచి వ్యాపించే చీడపీడల నుంచి దీర్ఘకాలం పాటు పంటను రక్షించవచ్చు. మిరప విత్తనాలను మూడు రకాలుగా శుద్ధి చేసుకోవచ్చు. వైరస్ తెగుళ్ల నివారణకు గాను కిలో మిరప విత్తనానికి గాను 150 గ్రాముల ట్రైసోడియం ఆర్థోఫాస్ఫేట్‌ను ఒక లీటరు నీటిలో కరిగించి దానిలో 15 నుంచి 20 నిమిషాల పాటు విత్తనాన్ని నానబెట్టి తర్వాత నీటిని తీసివేసి మంచి నీటితో శుభ్రంగా కడిగి విత్తనాలను నీడలో ఆరబెట్టుకోవాలి. రసం పీల్చు పురుగుల నివారణకు గాను 8గ్రాముల ఇమిడాక్లోప్రిడ్‌ను కిలో విత్తనానికి పట్టించాలి. దీనివలన విత్తిన 20–25 రోజుల వరకు రసం పీల్చు పురుగుల ఉధృతి తగ్గుతుంది. బ్యాక్టీరియా, బూజు తెగుళ్ల నివారణకు గాను 3 గ్రాముల మాంకోజెబ్ లేదా కాప్టాన్ మందును కిలో విత్తనానికి పట్టించి విత్తుకోవాలి. చివరిగా అదే విత్తనాన్ని ట్రైకోడెర్మా విరిడి అనే శిలీంధ్రం పొడిని 5–10 గ్రాముల విత్తనానికి పట్టించి నారుమడిలో విత్తుకోవాలి.

> **కలుపు యాజమాన్యం**
>
> మిరప పంటలో కలుపు నివారణకు మొక్కలు నాటిన 20–25 రోజుల తర్వాత కలుపు గొర్రు లేదా గుంటుకలను ప్రతి 15–20 రోజులకు ఒక్కసారి దున్నాలి. ఎలా మొక్క నేల మొత్తాన్ని కప్పివేసేవరకు 4–5 సార్లు దున్నాలి. మొక్కలను నాటుకునే 1–2 రోజుల ముందు లీటర్ నీటిలో 1.5మిల్లీలీటర్ల పెండిమిథాలిన్ కలుపుకుని పిచికారీ చేసుకోవాలి. పంటలో కలుపు మొక్కలు ఉన్నట్లయితే మొక్కలు నాటిన 25 రోజుల తర్వాత ఎకరానికి 400–500 మిల్లీలీటర్ల క్విజాలోఫాస్ ఇథైల్‌ను మొక్కలపై పడకుండా జాగ్రత్తగా పిచికారీ చేసుకోవాలి.